# ఆగిన వాచీ

ఏడు నిమిషాలు, ఏడు రెండు నిమిషాలు, ఏడు అయిదు నిమిషాలు ఏడు దాటుతోంది. వకచోట గంటలు కొట్టుతోంది. అన్నీ నడుస్తున్నవే.

నాకు కంగారెత్తి పోయింది. ఎటుచూసినా కదులుతున్న ముళ్ళే, కొన్ని ఖంగు ఖంగున మ్రోగుతున్నాయి.

కొన్ని నిలబడిపోయినాయి. రెండు ముప్పావు, వకటి ఏభై, నాలు గుంబావు, అయిదున్నర యీ విధంగా ఇవన్నీ వాటి వాటి గమ్యస్థానం చేసుకున్నట్లున్నాయి.

బుల్లిబుల్లి తొట్లల్లో చిన్ని చిన్ని పాపల్లాగ మెల్లిమెల్లిగా కదులు తున్నాయి కొన్ని అద్దాల అలమారల్లో, కొన్ని కొన్ని నల్లనల్లగా కొన్ని కొన్ని తెల్లతెల్లగా ఎవరిబిడ్డ వాళ్ళకు ముద్దు.

ఇది బాగుండలేదని వకదాన్ని వకాయన క్రింద పెట్టాడు. అసలాయన వచ్చి మందలించాడు నిదానంగా పెట్టమంటూ.

"నీకు యిష్టంలేకపోతే సరేమిటి. ఇంకొకతను తీసుకుంటాడు" అంటూ తన చేతుల్లోకి తీసుకుని తుడుస్తున్నాడు.

"నేను వకదాన్ని దగ్గరకు చేర్చుకున్నాను. కిలకిల నవ్వింది. నా హృదయం పొంగింది.

మీకేది కావాలో తీసుకోమన్నాడు. నాకు కావలసింది తీసుకున్నా నన్నాను.

బైటనుంచి యెవరో వకాయన వకదాన్ని తీసుకువచ్చాడు. లోపలికి తీసుకువెళ్ళి నాలుగు రోజులాగి రమ్మన్నాడు అసలాయన.

విచారంగా ఆ వచ్చిన మనిషి వెళ్ళిపోయాడు. వచ్చేవి వస్తుంటే పోయేవి పోతున్నాయి. అంతులేని ప్రవాహం.

అట్లాగే చూస్తూ కాసేపు నిలబడి పోయాను.

లోపల మూలగా వక గదివుంది. ఆ గదిలోకి వెళ్ళటమంటే వీట న్నింటికీ తగని భయం. లేకపోతే వెళ్ళకపోవటం తమ చేతుల్లో లేనిది. గోడమీదనుంచి వక పెద్ద గడియారాన్ని నలుగురు పట్టుకుని అక్కడికి తీసుకు వెళ్ళారు. ప్రక్కన అలమారలోంచి బుల్లిగడియారాన్ని తీసుకు వెళ్ళారు. వాటిపని అయిందన్న మాట.

రెండూ చూస్తూ నిలబడిపోయాను.

ప్రీతిగా ఆ చిన్నదాన్ని చేతుల్లోకి తీసుకుని యింటికి వచ్చాను పార్వతి కోర్కె తీర్చాను. పార్వతి మురిసి పోయింది. ఎంత ముద్దుగా వున్నది అనుకున్నది. పార్వతికిఆనాడల్లా మంచికాలక్షేపము అయింది. దానిని చూస్తుంటే నాకు తెలియకుండానే ఏదో ఆప్యాయత నాలో ప్రవేశిస్తోంది. దానివంకే చూస్తూ, యెంతసేపయినా ప్రొద్దు పుచ్చచ్చు అనుకున్నాను. నాకు యిష్టంలేని అభిప్రాయం నాకే కలగటం నాకు ఆశ్చర్యంగానే వున్నది.

తీసేసి విడిగా పెడదామనుకున్నా, వద్దంటూ పార్వతి పట్టుపట్టింది.

నేను కాదనలేకపోయినా, అసలు కాదనటానికి కారణము కనుపించ లేదు.

ముద్దొస్తున్న ముళ్ళవంక చూస్తుంటే పార్వతికి ఏదో జ్ఞాపకం వచ్చి నట్లుంది కంట తడిపెట్టింది. నేను ఏమిటని అడగ దలుచుకోలేదు,

'ఈ ముల్లు చూడండి యెట్లా తిరుగుతోందో' అంటూ తన గొంతుకలో వణుకును నాకు తెలియపరిచింది పార్వతి.

ఆ ముళ్ళు అట్లా తిరుగుతూవుంటే పసిపిల్లవాడు చేతులు త్రిప్పినట్లని పించింది.

వేళకు పాలుపట్టకపోతే యెట్లాగు అన్నట్లు 'కీ యిచ్చారా కీయిచ్చారా' అంటు మాటిమాటికి జ్ఞాపకం చేస్తోంది పార్వతి.

"ప్రేమకొద్దీ పాలు యెక్కువ యిచ్చినాడంటే అన్నాను నవ్వుతూ. పార్వతి కళ్ళనీళ్ళు కళ్ళల్లోనే నిల్చిపోయినాయి. నాకుయేదో మరిచిపోయిన విషయాన్ని పార్వతి జ్ఞాపకం చేసినట్లనిపించింది.

నేను రెండు నిమిషాలపాటు నిశ్శబ్దతను భంగపరచలేకపోయినా.

పార్వతి కళ్లల్లోకి చూడలేకపోయినా కూడ. వకసారి ఆ ముళ్లలోకి చూశాను. పార్వతి వంటిట్లోకి వెళ్లిపోయింది.

కాలక్షేపంలేదు అన్నదల్లా దీంతో కాలక్షేపం అయిపోతోంది. నేను సాయంత్రము యెప్పుడు వస్తానా అని కాచుకూర్చో వక్కర్లేదు యిప్పుడు.

ఆ రాత్రి ప్రొద్దుపొయ్యేదాక దీని విషయముమీదే చర్చలుజరిగినాయి.

"రేపు దీన్ని తీసుకువెళ్ళి బాగుచేస్తానన్నాను" ప్రక్కన టేబుల్‌మీద వున్న అలారము గడియారాన్ని చూపిస్తూ.

ఇప్పుడేం తొందర అన్నది పార్వతి.

అదేమిటి ఆరేళ్ళు మనల్ని అంటిపెట్టుకుని వుంది. ఇవ్వాళ దానిని బాగుచూడకపోతే యెట్లాగు అన్నాను.

అది ఆగిపోయి చాలా రోజులయిందన్నది. ఫరవాలేదు. రేపు జ్ఞాపకం చెయ్యమని నిద్రపోయాను.

తెల్లవారి లేవంగానే, క్రమెంటయింది పార్వతి చిరుచీకట్లలో చిన్నదాని ముఖం చూస్తూ.

అదుర్దాగా దానివంకచూస్తూ ఆగిపోయిందన్నాను. 'ఇది ఆగిపోయిందీ' అంటూ ఆశ్చర్యపోయింది. పార్వతి.

"ఎట్లాగోట్లా బాగుచేయించుకురండి. ఇది చాలా బాగుంది" అన్నది అదుర్దా అంతా వెళ్లబుచ్చుతూ.

ఆ షాపులో అసలాయనకు చూపించాను ఆ మూలగదిలో నలుగు రైదుగురు వున్నారు. ఆగదిలోకి దీన్ని తీసుకపోతుంటే నాఒళ్ళు ఝల్లు మన్నది. కాని తప్పనిసరి. మిగతావాటివంక చూస్తూ నిలబడిపోయాను. ఇంకా చిన్నచిన్నవి, బుల్లిబుల్లివి అన్నీ చూస్తున్నాను. కాని అన్నింటిలోను దానిరూపే ప్రతిబింబిస్తోంది. నా మనస్సులో దానిమాటే స్ఫురిస్తోంది. ఆ గదిలోంచి యేమిమాట వస్తుందో అనే ఆదుర్ధగా యెదురుచూసున్నాను.

వక్కసారిగా వచ్చి, మెయిన్ స్ప్రింగ్ తెగిపోయిందన్నాడు ఆతను. అట్లాగే నిలబడిపోయాను.

నా ముఖంవంక చూస్తూ, మీదగ్గర యింత త్వరలో యెందుకు పోతున్నాయో నాకు అర్థంకావటం లేదన్నాడు.

నేను యేమి మాట్లాడలేకపోయాను. విచారంగా యింటిగుమ్మం ముందు వచ్చి నిలబడ్డాను.

'ఏది ఏమయింది, ఎక్కడ' అంటూ అదుర్దాగా అడుగుతోంది పార్వతి.

నేను వట్టిచెయ్యి చూపించాను. పార్వతి చెయ్యిపట్టుకుని గట్టిగా యేడ్చింది.

—:0:—